మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL
ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 226 09 శుక్రవారం, ఫిబ్రవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంప్రదించండి
సెల్:9154842842

## 75వేల మంది మహిళా డెవలపర్లకు నైపుణ్య శిక్షణ

మైక్రోసాఫ్ట్ సిఇవో
సత్య నాదెళ్ల ప్రకటన

బెంగళూరు,ఫిబ్రవరి8(మరో ఉదయం):



ఈ ఏడాది చివరికి భారత్‌లో 75వేల మంది మహిళా డెవలపర్లకు నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ సిఇవో సత్య నాదెళ్ల ప్రకటించారు. భారత పర్యటనలో ఉన్న ఆయన గురువారం బెంగళూరులోని 'మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్' నిర్వహించిన డెవలపర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మైక్రోసాఫ్ట్ నిర్వహిస్తున్న 'కోడ్ విత్‌అవుట్ బ్యారియర్స్' ప్రోగ్రామ్ గురించి నాదెళ్ల కీలక ప్రకటన చేశారు. ఈ ప్రోగ్రామ్‌ను భారత్‌లోనూ చేపట్టాలని నిర్ణయించాం. దీనిద్వారా 2024 చివరికి 75వేల మంది మహిళా డెవలపర్లకు నైపుణ్యాల శిక్షణ ఇవ్వనున్నాం. ఈనెల నుంచే దీన్ని ఆరంభించనున్నాం. దీంతో మహిళా డెవలపర్లు, కోడర్లు, టెక్నికల్ రోల్స్‌లో పనిచేసే యువతులకు మరిన్ని నెట్‌వర్కింగ్ అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. ఈ ప్రోగ్రామ్‌ను మైక్రోసాఫ్ట్ 2021లో తొమ్మిది ఆసియా-పసిఫిక్ దేశాల్లో ప్రారంభించింది. క్లౌడ్, ఏఐ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో లింగ అంతరాన్ని తగ్గించడం కోసం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. తాజాగా దీన్ని భారత్‌కూ విస్తరిస్తున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించారు. భారత్‌లో 2025 కల్లా 20 లక్షల మందికి కృత్రిమ మేధలో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే.

# మన్మోహన్ సేవలు నిరుపమానం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(మరో ఉదయం):

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యుల వీడ్కోలు సందర్భంగా ప్రధాని సభలో ప్రసంగించారు. మోదీ మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ తన ఆరోగ్యం బాలేనప్పుడు కూడా వీల్ చైర్‌లో పనిచేశారని గుర్తు చేశారు. ఒకానొక సమయంలో ఓటింగ్ సందర్భంగా మన్మోహన్ వీల్ చైర్‌లో వచ్చి ఓటు వేశారని ఆ ఘటన వృత్తిపట్ల తనకున్న నిబద్ధతకు తార్కాణంగా నిలిచిందని పేర్కొన్నారు. పదవీ విరమణ చేయనున్న రాజ్యసభ సభ్యులకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఢిల్లీలోని తన నివాసంలో గురువారం వీడ్కోలు ఇవ్వనున్నారు. ఈమేరకు ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో రాజ్యసభ సభ్యులు గ్రూప్ ఫొటోలు దిగారు.రాజ్యసభలో 56 మంది ఎంపీలు త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం వారికి సభలో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీమాట్లాడుతూ మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన ఎంపీలందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ దేశానికి మన్మోహన్‌జీ చేసిన సేవ అపారం. సుదీర్ఘకాలం పాటు రాజ్యసభకు ఆయన అందించిన సహకారం, దేశాన్ని నడిపించిన తీరు ఎప్పటికీ గుర్తుంటుంది. రాజ్యసభలో ఇటీవల ఓ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ట్రెజరీ బెంచ్ గెలుస్తుందని తెలిసినప్పటికీ ఆయన వీల్‌ఛైర్‌లో వచ్చి ఓటు వేశారు. ఓ సభ్యుడిగా తన విధుల విషయంలో ఎంత బాధ్యతగా ఉన్నారనడానికి ఇదొక ఉదాహరణ. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఆయన చక్రాల కుర్చీలో ఉన్నా పనిచేశారు. ఎంపీలందరికీ ఆయన ఆదర్శం అని మోదీ ప్రశంసించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' గురించి మోదీ ప్రస్తావించారు. ఆ పత్రం మా ప్రభుత్వానికి దిష్టి చుక్క లాంటిదే. మాపై చెడు చూపు పడకుండా చేస్తుంది. ప్రతిపక్షాల చర్యను మేం స్వాగతిస్తున్నాం అని అన్నారు. తన పదేళ్ల పాలనపై కేంద్రంలోని అధికార భాజపా 'వైట్‌పేపర్'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



'బ్లాక్ పేపర్'ను వవిడుదల చేశారు. నిరుద్యోగం, ధరల కట్టడి, రైతుల సమస్యలను తీర్చడంలో కేంద్రం విఫలమైందని హస్తం పార్టీ ఈ పత్రంలో ఆరోపించింది.

## తెలంగాణలో
# ప్రజాప్రభుత్వం ఏర్పాటు

ప్రజాభవన్ కంచె తొలగింపుతో ప్రజలకు స్వేచ్ఛ
ఇచ్చిన హామీ మేరకు 2లక్షల ఉద్యోగాల భర్తీ
మూసీ అభివృద్ధి,రంగారెడ్డి పాలమూరు పూర్తి చేస్తాం
ఆరుగ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం
ఆర్థికంగా చిన్నాభిన్నం అయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పని
ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్,ఫిబ్రవరి8(మరో ఉదయం):



మిగతా 2 లో

## తెలంగాణ తల్లి విగ్రహంపైనా
# తప్పుడు ఆరోపణలు

చంద్రబాబు సలహా
మేరకు రేవంత్ నిర్ణయాలు
టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్
రెడ్డిని తప్పించాలి
విద్యుత్ సంస్థలో ఆంధ్రా వారి
నియామకాలు
సింగరేణి ఉద్యోగాలపై
తప్పుడు ప్రకటనలు
మీడియా
సమావేశంలో
కవిత విమర్శలు

హైదరాబాద్,ఫిబ్రవరి8(మరో ఉదయం):

మిగతా 2 లో



## సాగర్‌ను జగన్ ఆక్రమిస్తే మిన్నకున్నదీ
# ఆయనే

కేఆర్ఎంబీకి ప్రాజెక్ట్‌లను
అప్పగించింది కెసిఆరే
విజయసాయి రెడ్డి వ్యాఖ్యలను
సీరియస్‌గా తీసుకోం
మీడియా చిట్‌చాట్‌లో
సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి8(మరో ఉదయం):

కేఆర్ఎంబీకి ప్రాజెక్టలను అప్పగించింది గత బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సాగర్‌ను జగన్ పోలీసులతో ఆక్రమించారని... అప్పుడు కేసీఆర్ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రతిరోజు 12 టీఎంసీలను ఏపీ తీసుకుని వెళుతుంటే.. కేసీఆర్ ఎందుకు అడ్డుకోలేదన్నారు. ఇద్దరి మధ్యా ఏదో అవగాహన లేకుంటే ఇలా ఎందుకు జరుగుతుందని అన్నారు. అయితే ఇదే సందర్భంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను కలుస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సీఎంగా నేను కేసీఆర్‌ను కూడా కలుస్తా అని అన్నారు. బేసిన్‌లు లేవు భేషజాలు లేవని కేసీఆర్.. ఆయన కమిట్‌మెంట్ చేసుకున్నారని ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని సీఎం అన్నారు. మరో మూడు నెలలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ రాజ్యసభలో ఏపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు సీఎం స్ట్రాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. విజయ సాయి రెడ్డి .. నాన్ సీరియస్ పోలిటిషన్... అలాంటి వాళ్ళను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అంటూ ముఖ్యమంత్రి కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయం మార్పుపై



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఎల్‌వోపీ మార్పు స్పీకర్ నిర్ణయం అని తెలిపారు. సభలో కులగణన తీర్మానం ఉంటుందన్నారు. అంశాలు చర్చించాల్సిన అవసరం అనుకుంటే సభను పొడిగించవచ్చని స్పీకర్ గడ్డం ప్రసాద్ చెప్పారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## రచ్చబండ కార్యక్రమంలో జగన్ సర్కార్‌పై
# షర్మిల విసుర్లు

భూహక్కుల
చట్టంతో భూ కబ్జాలు
లిక్కర్ తరహాలో ప్రజల
భూములపై కన్ను

గుంటూరు,ఫిబ్రవరి8(మరో ఉదయం):



మిగతా 2 లో

# మోడీ బిసి కాదు.. ఓసికి చెందిన వ్యక్తి



మిగతా 2 లో

అందుకే
కులగణను
వ్యతిరేకిస్తున్నారు
కాంగ్రెస్ అగ్రనేత
రాహుల్ గాంధీ
ఆరోపణ
తిప్పికొట్టిన
కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(మరో ఉదయం):

## హామీల అమలుపై
# ప్రస్తావన ఏదీ

స్పష్టత లేకుండా గవర్నర్
ప్రసంగం పంటలకు బోనస్,
-రుణమాఫీపై దాటవేత
మీడియా పాయింట్ వద్ద
హరీష్ రావు

హైదరాబాద్,ఫిబ్రవరి8(మరో ఉదయం):



హామీల అమలుకోసం ఎదురు చూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం నిరాశ మిగిల్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎన్నికల హామీల అమలుపై స్పష్టత లేదని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై విశ్వాసం కల్పించలేకపోయిందన్నారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఎప్పటి నుంచి ఇస్తారో గవర్నర్ ప్రసంగంలో చెప్పలేదన్నారు. రైతులకు బోనస్ ఇచ్చే విషయమై ఒక్క మాటా లేదన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ఒక్క మాట కూడా చెప్పలేదన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేలు ఇచ్చే విషయాన్నీ ప్రస్తావించ లేదన్నారు. గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ గురించి మాత్రమే చెప్పారు. మేనిఫెస్టో అంశాల గురించి ఎక్కడా చెప్పలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ, గవర్నర్ ప్రతిష్ట దిగజార్చిందన్నారు.ప్రజావాణి తుస్సుమన్నదని విమర్శించారు. ప్రజావాణిలో రోజూ సీఎం స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. మొదటి రోజు తరువాత సీఎం మొహం చాటేశారని విమర్శించారు. ప్రజావాణికి రోజుకొక మంత్రి వెళ్తారన్నారు.. అదీ లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దరఖాస్తులు తీసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కలెక్టర్లు దరఖాస్తులు తీసుకునేవారని వెల్లడించారు. ప్రజావాణి గురించి గర్నవర్‌తో అర్ధసత్యాలు చెప్పించారన్నారు. ఆరు గ్యారంటీల్లో 13 హామీలున్నాయని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో మూడు చెప్పి ఒక గ్యారంటీ అమలుచేశామని చెబుతారా అని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ అమలు లోపభూయిష్టంగా ఉన్నందునే గవర్నర్ ప్రసంగంలో చెప్పించ లేదన్నారు. నిర్దిష్ట సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రైతులకు ఇచ్చిన నాలుగు హామీలు అమలు చేయడం లేదని చెప్పారు. డిసెంబర్ 9న అధికారంలోకి వస్తాం, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. అయితే ప్రమాణ స్వీకారాన్ని ముందుకు జరిపి.. హామీల అమలును వాయిదా వేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. వంద రోజుల్లో 60 రోజులు పూర్తయ్యాయ, ఇంకా 40 రోజులే ఉన్నాయని గుర్తుచేశారు. మరో పది రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది.. అప్పటివరకు సాగదీసి హామీల అమలు వాయిదా వేయాలని ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. ఎన్నికల కోడ్ వస్తే హామీలు ఎలా అమలు చేస్తారని నిలదీశారు. చిత్తశుద్ధి ఉంటే హామీల అమలు గురించి గవర్నర్ ప్రసంగంలో ఉండేదన్నారు. రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు కరెంట్ గురించి మాత్రమే ప్రస్తావించారని, మిగతా హామీలు వచ్చే ఏడాదిలో చేయలేమని అని చెప్పకనే చెప్పారని వెల్లడించారు. వంద రోజుల్లో అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. రూ.15 వేల రైతుభరోసా ఇస్తామన్నారు, 10 వేల రైతుబంధు కూడా ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వచ్చే యాసంగి పంటకు అయినా బోనస్ ఇస్తామని చెబుతారని ఎదురు చూశాం.. కానీ నిరాశ ఎదురైందన్నారు. రూ. 40 వేల కోట్ల పెట్టుబడిపై వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి పవర్ ఎ÷-లాంట్ ఊసేలేదని విమర్శించారు. మూసీ నది ప్రక్షాళన బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రారంభించిందని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం ఇస్తారన్నారు.. కానీ 7వ తేదీ వచ్చినా జీతాలు పడలేదన్నారు.

# కోమలంచలో విష జ్వరాలు...

# ఇంటికొకరు మంచం పట్టారు

## గ్రామంలో వైద్య శిబిరం..

## వైద్యాధికారులకు చిక్కని వ్యాధి

**నిజాంసాగర్(జుక్కల్)ఫిబ్రవరి 7,మరో ఉదయం,**

ఆ గ్రామంలో ఏమైందో ఏమో కానీ... ఒకరి తర్వాత ఒకరు జ్వరాల బారిన పడ్డారు... జ్వరమే కదా తగ్గిపోతుంది అని మంచం పట్టారు... ఒకరి తర్వాత ఒకరు విష జ్వరాల బారిన పడ్డారు. ఒకటి కాదు ఇద్దరు కాదు ఏకంగా 100 మంది చిన్న,. పెద్ద అనే తేడా లేకుండా ఆ గ్రామంలో అందరూ జ్వరంతో మంచం పట్టారు. ఇది కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం కోమలంచలో చోటుచేసుకున్న ఘటన. ఈ విషయం తెలుసుకున్న వైద్యాధికారి రోహిత్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు . జ్వరాల బారిన పడ్డ కొంతమంది . రక్తాన్ని తీసుకొని పరీక్షలు నిమిత్తం కామారెడ్డికి పంపారు. ఈ జ్వరాలు ఎందుకు వచ్చాయో వైద్యులకు కూడా అంతు పట్టడం లేదు. గ్రామం అంతా జ్వరాలతో వణుకుతున్నారు. వైద్యులు కోమలంచ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి చికిత్సలు చేస్తున్నారు. ఒకేసారి గ్రామంలో . ఇంటికొకరు జ్వరాల బారిన పడి మంచం పట్టడంతో వైద్యులు కూడా ఈ జ్వరాలు ఎందుకు వచ్చాయి? వీటికి గల కారణాలు ఏంటి కూడా వారికి అంతు పట్టడం లేదు. కానీ గ్రామంలో మాత్రం గత మూడు రోజులుగా రోజురోజుకు జ్వరాల బారిన పడ్డ వారి సంఖ్య పెరుగుతుంది. దీనివల్ల కోమలంచ గ్రామానికి వెళ్లడానికి. వేరే గ్రామం నుంచి రావడానికి బంధువులు సైతం భయపడుతున్నారు. వైద్యులు మాత్రం తాము పరీక్షలు నిమిత్తం రక్తాన్ని కామారెడ్డి ఆసుపత్రి పంపించామనినివేదిక వచ్చేవరకు తాము ఏమి చెప్పలేమంటూ వైద్యులు వెల్లడిస్తున్నారు.





మొదటిపేజీ తరువాయి

# తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు

తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాడారని.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాభవన్ ముందున్న ఇనుప కంచెను తొలగించడం ద్వారా ప్రజలకు స్వేచ్ఛ కలిగించామని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. ప్రజల కోసం ఏర్పడ్డ ప్రభుత్వం ఇదని అన్నారు.టీఎస్‌పీఎస్సీ ద్వారా 2 లక్షల ఉద్యోగాల భర్తీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. పెద్దఎత్తున మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపడతామని.. ఆ నది మరోసారి హైదరాబాద్ జీవనాడిగా మారుతుందని చెప్పారు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే పనిలో ఉన్నామని అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రముఖ కవి కాళోజీ నారాయణ కవితతో గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. సామాన్య ప్రజల కోసం ప్రజాభవన్‌ను తెరిచామని చెప్పారు. ఆరు గార్యంటీలల్లో రెండింటిని అమలు చేశామని.. త్వరలో మరో రెండు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులకు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి.. మాకు అప్పగించారని..ధనిక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని చెప్పారు. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక వ్యవస్థను గాడిన పెడతామని.. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాలానుగుణంగా హామీలను అమలు చేస్తామని.. ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో 1.8 కోట్ల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాభవన్ కంచెను తొలగించారన్నారు. దీంతో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజల కొరకు ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాటం చేశారని ప్రశంసించారు. యువకుల బలిదానాలతోనే తెలంగాణ ఏర్పాటైందని గుర్తు చేశారు. ప్రజాకాంక్షలు నెరవేరేలా ఈ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రజాభవన్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజలకు అనుమతి లభించిందని, తెలంగాణ ఏర్పాటులో కలిసి వచ్చిన పార్టీలు, వ్యక్తులకు తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలుపుతోందని గవర్నర్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సకాలంలో అమలు చేస్తామని, ఇప్పటికే రెండు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఉచిత ప్రయాణం ద్వారా ఇప్పటివరకు 15 కోట్ల మంది మహిళలు ప్రయాణించారన్నారు. పాలమూరు రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, టిఎస్‌పిఎస్‌సి ద్వారా రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేవంత్ ప్రభుత్వం కొత్త ఎంఎస్ఎంఇ విధానం ప్రకటించిందని, దావోస్ సమావేశంలో రూ.40 వేల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని వెల్లడించారు. తెలంగాణ ఇచ్చిన అప్పటి మన్మోహన్ సింగ్ సర్కారుకు ప్రభుత్వం కృతజ్ఞతలు తెలుపుతోందని, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ అగ్రనేత, యుపిఎ వైఎస్ చైర్మన్ సోనియాగాంధీ పోషించిన చారిత్రక పాత్రను ప్రభుత్వం స్మరించుకుంటోందన్నారు. ప్రజాపాలనలో 1.2 కోట్ల దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించామని తమిళి సై వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామన్నారు. అర్హులైన వారికి రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు తెలిపారు. కచ్చితంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. ధనిక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థమైందని... దాన్ని చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేస్తామన్నారు. యువతకు 2 లక్షల ఉద్యోగుల కల్పనపై దృష్టిపెట్టామన్నారు. ప్రజావాణిలో 1.8కోట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. మౌలిక వసతులరంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలపై పన్నుల భారం పడకుండా చూస్తామన్నారు. గత సమావేశాల్లో ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందిస్తామని గవర్నర్ తమిళిసై వెల్లడించారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానం, మౌలిక వసతుల రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం కొత్త విధానాన్ని కూడా అమలులోకి తీసుకొస్తామన్నారు. ధరణి కమిటీ ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తాం. మా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పాటిస్తుంది. గత ప్రభుత్వం నిర్వాకాలను శ్వేతపత్రం ద్వారా ప్రజలకు తెలియజేశాం. రాష్ట్రంలో ప్రత్యేక నైపుణ్య వర్సిటీలు ఏర్పాటు చేస్తాం. విద్యతో పాటు ఉద్యోగమూ సాధించేలా యువతలో నైపుణ్యాలు పెంపునకు కృషి చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, వికలాంగ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తాం. 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. హైదరాబాద్‌ను దేశంలోనే కృత్రిమ మేధ (ఏఐ) ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 50 నుంచి 100 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేస్తాం. రూ.2 వేల కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తాం. క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేయడమే మా లక్ష్యం. కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బ్జడెట్ కేవలం ఆర్థిక పత్రం కాదు.. భవిష్యత్‌కు నమూనా అని చెప్పారు.గవర్నర్ ప్రసంగం అనంతరం శాసన సభ, శాసన మండలి సమావేశాలు నేటికి వాయిదా పడ్డాయి. అంతకుముందు గవర్నర్ తమిళసై అసెంబ్లీకి రాగానే సిఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాదరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబులు వెళ్ళి స్వాగతం పలికి తోడ్కొని వచ్చారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ తల్లి విగ్రహంపైనా తప్పుడు ఆరోపణలు

గురువు చంద్రబాబు బాటలో శిష్యుడు సీఎం రేవంత్ రెడ్డి నడుస్తు న్నాడని.. ఆయనలో పచ్చ రక్తం ప్రహిస్తోందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డిని నియమించడంపై ఎమ్మెల్సీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డిని తప్పించాలని డిమాండ్ చేశారు. మహేందర్ రెడ్డిపై ఆరోపణల నేపథ్యంలో జ్యుడిషియల్ విచారణ జరిపించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో డీజీపీగా ఉన్న మహేందర్ రెడ్డిని అప్పుడు రేవంత్ రెడ్డి దూషించారన్నారు. టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి తక్షణమే తొలగించాలని కవిత డిమాండ్ చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై త్వరలో గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు. మాజీ డీజీపీపై జ్యుడిషియల్ విచారణ జరపాలన్నారు. మహేందర్ రెడ్డిపై రేవంత్ రెడ్డి గతంలో దుర్భాషలాడారని గుర్తుచేశారు. టీఎస్‌పీఎస్సీలో ఆంధ్రా వ్యక్తిని సభ్యుడిగా నియమించారని ఆరోపించారు. రాజకీయ నేపథ్యం ఉన్న పాల్వాయి రజనిని మెంబర్‌గా ఎలా నియమిస్తారన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా ఆంధ్రా వ్యక్తిని ఎలా నియమించారని ప్రశ్నించారు. వాళ్లు తెలంగాణ యువతకు ఏం న్యాయం చేస్తారని అడిగారు. రాజకీయాలకు సంబంధమున్న వారిని కమిషన్ సభ్యులుగా నియమించ బోమని సీఎం అన్నారన్నారు. విద్యుత్తు సంస్థలో ఆంధ్రా అధికారుల పెత్తనమేంటని అంటూ..ముగ్గురు ఆంధ్రా అధికారులను డైరెక్టర్లుగా నియమించారని, వారు తెలంగాణ ప్రయోజనాలు ఎందుకు కాపాడుతారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓటుకు నోటు కేసును వాదించిన న్యాయవాదులను సీఎం అందలమెక్కించారన్నారు. సింగరేణి ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. డిసెంబరు లోగా 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 60 ఉద్యోగాలనే నోటిఫై చేసిందని కవిత పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ అబద్ధాలను వదలడం లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. రాష్ట్ర గీతం గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సీఎం రేవంత్ ఒక్కసారి కూడా చెయ్యెత్తి జై తెలంగాణ అనలేదని విమర్శించారు. సింగరేణి ఉద్యోగ మేళా సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహం తనలా ఉందని సీఎం అంటున్నారని, తానూ తెలంగాణ ఆడబిడ్డనే కదా అని ప్రశ్నించారు. అయినా తెలంగాణ తల్లి విగ్రహం గురించి ముఖ్యమంత్రి మాట్లాడటం ఏంటన్నారు. రాష్ట్రంలో కరెంటు కోతలు మొదలయ్యాయని చెప్పారు. చంద్రబాబు డైరక్షన్‌లో తెలంగాణ ప్రభుత్వం నడుస్తున్నట్లుందని ఆరోపించారు. అర్హత లేని వ్యక్తులను సలహాదారులుగా నియమించారని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీకి ఏపీ అడ్వైజర్ ఎందుకని ప్రశ్నించారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు పోగొట్టిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో 20 వేల డిపెండెంట్ ఉద్యోగాలిచ్చామని చెప్పారు. జీఎం స్థాయిలో చేయాల్సిన పనిని సీఎం చేస్తున్నారని విమర్శించారు. కొత్తగా 400 ఉద్యోగాలు ఇచ్చినట్లు అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను తాము ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారని వెల్లడించారు.

# వెల్లుల్లికి పెరిగిన డిమాండ్

# సామాన్యులకు చుక్కలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8: మరో ఉదయం**

వేసవికాలం రాకముందే నిత్యావసరాల ధరలు మంటెక్కిస్తున్నాయి. రేట్లు ఆకాశాన్ని తాకడంతో సామాన్యుల జేబులు ఖాళీ అవుతున్నాయి. కొద్ది నెలల కిందట కొండెక్కిన ఉల్లి, టమాటా ధరలు దిగి వచ్చాయి. అయితే, ప్రస్తుతం వెల్లుల్లి మాత్రం జనాలకు చుక్కలు చూపిస్తోంది. నిత్యం వంటల్లో అల్లం, వెల్లుల్లి తప్పనిసరి. లేదంటే ఆ కూర రుచిగా ఉండదు. కానీ, ప్రస్తుతం వెల్లుల్లి కిలో 500పై మాటే పలుకుతోంది. దీంతో వంటి గది నుంచి వెల్లుల్లి మాయమయ్యే పరిస్థితి నెలకుంది. రెండు వారాల్లో ధరలు రెట్టింపయ్యాయి. వాస్తవానికి గతేడాది నవంబరు మధ్య నుంచి దేశవ్యాప్తంగా వెల్లుల్లి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. డిసెంబరులో రిటైల్ మార్కెట్లలో వెల్లుల్లి కిలో 350 నుంచి 400 ఉండగా.. హెూల్ సేల్ మార్కెట్‌లో అత్యంత నాణ్యమైన వెల్లుల్లి 250 పలికింది. కానీ, ప్రస్తుతం ఇది మరింత పెరిగి. ఏకంగా కిలో 500 కి ఎగబాకింది. ఉస్మాన్ గంజ్ లాంటి హెూల్సేల్ మార్కెట్లో ధర తక్కువగా ఉంటుందని వచ్చామని, అయితే ధరలు చూసి ఖంగు తిన్నారు.వెల్లుల్లి దిగుబడి తగ్గడంతో మార్కెట్లలోకి సరఫరా అంతంతమాత్రంగా ఉంది. డిమాండ్‌కు తగిన సప్లై లేకపోవడంతో వెల్లుల్లి ధర పెరుగుతోంది.వెల్లుల్లి సాగు ఖరీఫ్, రబీ సీజన్లలో జరుగుతుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో జూలైలో వేసిన పంట దెబ్బతిందని వ్యాపారులు తెలిపారు. భారత్‌లోని మొత్తం వెల్లుల్లి ఉత్పత్తిలో దాదాపు 40% వాటా మహారాష్ట్రదే. ప్రస్తుతం పాత స్టాక్ అరకొరగా అందుబాటులో ఉండగా.. కొత్త పంట కోసం రెండు నెలలు నిరీక్షణ తప్పదు. దీంతో అప్పటి వరకూ ధరలు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని హెూల్ సేల్ వ్యాపారాలు అంటున్నారు.అయితే అసలు కారణం మాత్రం వేరే ఉందని టాక్ వినబడుతుంది. ఇప్పుడు పెళ్లిళ్లు రంజాన్ మాసం ఉండడంతో ఈ డిమాండ్ బాగా పెరిగిందని.. దీనికి తోడు పంట పండించే రైతులు రెండు నెలలు ఆలస్యంగా మార్కెట్లోకి పంట వచ్చేలా ప్లాన్ చేసి డిమాండ్ క్రియేట్ చేశారని కొందరి మాట.రెండు నెలల ఆలస్యంగా మార్కెట్ లోకి వెల్లుల్లి పంట రావడం తో పంట కి మార్కెట్ లో డిమాండ్ పెరుగుతుంది..దాని ద్వారా పండించిన రైతులకు డిమండ్ వల్ల లాభాలు పెరుగుతాయని..అందుకోసమే ఇలా కృత్రిమ డిమాండ్ వచ్చింది అని కొందరి మాట. ఏది ఏమైనా వెల్లుల్లి ధరలు తగ్గాలంటే మాత్రం రెండు నెలల వరకు వెయిట్ చేయక తప్పదు.



మొదటిపేజీ తరువాయి

# రచ్చబండ కార్యక్రమంలో జగన్ సర్కార్‌పై షర్మిల విసుర్లు

భూమి హక్కుల చట్టం పేరుతో సర్కార్ భూ కబ్జాలకు పాల్పడే చట్టం తేవాలని అనుకుంటోందని పీసీసీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. లిక్కర్ వ్యాపారం గుప్పిట్లో పెట్టుకున్నట్లు.. ప్రజల భూములను గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తోందన్నారు.తెనాలి నియోజక వర్గం కొలకలూరు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే లిక్కర్‌ను బిజినెస్‌గా చేసుకున్న జగర్ సర్కారు.. కొత్త చట్టంతో భూ కబ్జాలకు పాల్పడాలని చూస్తోందని ఆరోపించారు. లిక్కర్ పేరుతో చెప్పిన మద్యాన్ని మాత్రమే అమ్మాలని రూల్ తెచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం మొత్తం దోచేశారు. రాష్ట్రంలో కల్తీ లిక్కర్‌తో 25 శాతం అదనంగా మరణాలు సంభవిస్తున్నాయి. ఒక మనిషిని పెడతారట.. ఆయన చెప్పినట్లే భూ లావాదేవీలు ఉండాలట. ఇదేం చట్టం... భూములపై సొంత హక్కులు హరించే చట్టం తేవడం ఏంటి..?. ఇలాంటి చట్టాలు తెచ్చే జఅఖ ప్రభుత్వం మళ్ళీ రావాలా ? ప్రజలు తేల్చుకోవాలి. లాండ్ టైటిల్ యాక్ట్.. వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్రంలో అన్ని ధరలు పెంచారు. చెక్కెర, నూనె, కూరగాయలు ఇలా అన్నింటి ధరలూ పెంచారు.'ఒక చేత్తో మట్టి చెంబు ఇస్తూ...మరో చేత్తో వెండి చెంబు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలు ఏవి ప్రజలకు అందడం లేదు.. ఉద్యోగాలు లేవు.. ఫీజు రీయింబర్స్మెంట్ లేదు. జాబ్ క్యాలెండర్ అని చెప్పి మోసం చేశారు. మెగా డీఎస్సీ అని చెప్పి మోసం చేశారు. చంద్రబాబు 7వేల పోస్టులు ఇస్తే హేళన చేశాడు. వైసీపీ వస్తే 25 వేల పోస్టులు ఇస్తామన్నారు. మెగా డీఎస్సీ నీ దగా డీఎస్సీ చేశాడు. 25 వేలు అని చెప్పి ఎన్నికల ముందు 6 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు పెరిగాయి. మన బిడ్డలు ఇక్కడ ఉద్యోగాలు లేకుండా వలసలు పోవాలా ?. 25 లక్షల ఇళ్లు అని చెప్పి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు.. జగన్ అన్నది దగా ప్రభుత్వం. మన బిడ్డల భవిష్యత్ మారాలి. ఉద్యోగాలు ఇచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి.. దోచుకునే ప్రభుత్వాలు పోవాలి. మాఫియాలు చేసే ప్రభుత్వం పోవాలని అన్నారు. ఎన్నికలు వస్తున్నాయి.. ఎవరు ఎన్ని డబ్బులు ఇస్తే అన్ని తీసుకోండి.. అవన్నీ మీ డబ్బులే. చుట్టూ ఇసుక మాఫియాతో సంబంధించిన డబ్బులే. కానీ ఓటు మాత్రం రాష్ట్రం అభివృద్ధి చేసే పార్టీకి మాత్రమే వేయాలి. చంద్రబాబుకి ఇచ్చిన అవకాశం చాలు. జగన్ అన్నకి ఇచ్చిన అవకాశం చాలు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో రావాల్సిన అవసరం ఉంది. హోదా ఇస్తామని స్వయంగా రాహుల్ హామీ ఇచ్చాడు. మొదటి సంతకం పెడతా అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని నమ్మాలి. ఎందుకంటే రాజశేఖర్ రెడ్డి పని చేసిన పార్టీ. నన్ను నమ్మండి.. హోదా తెచ్చే బాధ్యత నాది. పోలవరం పూర్తి కావాలి... రాజధాని కట్టాలి. ఃఆఖ,జఅఖ బీజేపీకి తోక పార్టీలు. వైసీపీ ప్రభుత్వం ఆదుకొనే ప్రభుత్వం కాదు. 12వేలు అమ్మఒడి అని చెప్పారు.. ఒక్క బిడ్డకు మాత్రమే నట. ఎన్నికల్లో జగన్ అన్న తరుపున నేనే ప్రచారం చేశా.. అందరికీ ఇస్తాం అని చెప్పా. కానీ జగనన్న ఈ హామీ నిలబెట్టుకోలేదని అంటూ షర్మిల పేర్కొన్నారు.

# మోడీ బిసి కాదు..ఓసికి చెందిన వ్యక్తి

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీ ఓబిసికి చెందిన వ్యక్తి కాదని మోడీని ఉద్దేశించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆయితే రాహుల్ చేసిన వ్యాఖ్యలను కేందప్రభుత్వం తోసిపుచ్చింది. 'రాహుల్ ప్రకటనపై వాస్తవాలు' అంటూ మోదీ జన్మించిన కులం గురించి స్పష్టత ఇచ్చింది. ప్రధాని మోదీ ఘాంచీ కులానికి చెందిన కుటుంబంలో జన్మించారని, 2000 సంవత్సరంలో గుజరాత్‌లో అధికారంలో ఉన్న భాజపా ఆ కులాన్ని ఓబీసీ విభాగంలో చేర్చిందని వివరించారు. గుజరాత్‌లో ఒక సర్వే అనంతరం మండల్ కమిషన్ కింద ఓబీసీ జాబితాను తయారుచేసింది. అందులో ఘాంచీ కులం పేరు కూడా ఉంది. దీనిని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు జులై 25, 1994లో నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పుడు మోదీ స్వరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఆ తర్వాత ఏప్రిల్ 4, 2000లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా దానిని ఓబీసీ జాబితాలోకి చేర్చారు. ఈ రెండు ప్రకటనలు ఇచ్చిన సమయంలో మోదీ అధికారంలో లేరు' అని కేంద్రం వెల్లడించింది.ఎన్నికల సమయంలో మాత్రమే మోదీకి తాను ఓబీసీననే విషయం గుర్తుకువస్తుందని కొద్దిరోజుల క్రితం రాహుల్ విమర్శించిన సంగతి తెలిసిందే. లేకపోతే కులగణన కోరిన ప్రతిసారీ దేశంలో ఉన్నది ధనిక, పేద అనే రెండు కులాలు మాత్రమే అని చెప్తారన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఉద్దేశించి బుధవారం పార్లమెంట్‌లో మోదీ స్పందించారు. 'దళితులు, ఆదివాసీలు, వెనకబడిన వర్గాల వారికి కాంగ్రెస్ వ్యతిరేకంగా పనిచేసింది. మాజీ ప్రధాని నెహ్రూను వారు గుడ్డిగా అనుసరిస్తున్నారు. రిజర్వేషన్లను ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మా హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అన్ని పదవుల్లో విశేష ప్రాధాన్యం ఇచ్చాం' అని వెల్లడించారు. అయితే మోడీ తన కులం విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒడిశాలోని ఝూర్సుగూడలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ఓబీసీ కులానికి చెందిన వ్యక్తి కాదని.. జనరల్ కేటగిరీకి చెందిన వారని ఆరోపించారు. ఆయన తన కులం గురించి అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. 'మోదీ ఓబీసీ కాదు. గుజరాత్‌లోని తెలీ కులంలో జన్మించారు. 2000 సంవత్సరంలో ఆయన కులాన్ని ఓబీసీల్లోకి మార్చారు. అగ్రవర్ణ కులాల్లో జన్మించినందుకే ఆయన కులగణనకు వెనకాడుతున్నారు' అని రాహుల్ అన్నారు. ఆయన చేపట్టిన న్యాయ్ యాత్ర గురువారం ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించనుంది. కాంగ్రెస్ పార్టీ నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్తీస్ గఢ్‌లో అధికారం కోల్పోయింది. ఆ తరువాత రాష్ట్రంలో రాహుల్ తొలిసారి పర్యటిస్తున్నారు. జనవరి 14న మణిపుర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఫిబ్రవరి 11న రాయ్‌గఢ్, శక్తి, కోర్బా జిల్లాల మీదుగా సాగనుంది. ఫిబ్రవరి 14న బలరాంపూర్ నుంచి జార్ఖండ్‌లో రాహుల్ అడుగుపెట్టనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయన ఈ యాత్ర చేపట్టారు.

# షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ప్లస్ గ్రేడ్ కేటాయింపు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8 :**


రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఈనెల 30, 31 కి న్యా క్ టీం సందర్శించిన తర్వాత వాళ్ళ నివేదికకు అనుగుణంగా న్యాక్ "బి ప్లస్ గ్రేడ్" కేటాయించింది. ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు గ్రేడింగ్ కోసం న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్) కమిటీలు కళాశాలను సందర్శిస్తారు. ఈ నేపథ్యంలో షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఈనెల 30, 31న ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ కమిటీ సందర్శించి కళాశాలలో ఉన్న ఫర్నిచరును కళాశాల వాతావరణాన్ని కళాశాల బిల్డింగును, బోధన నైపుణ్యాలను, బోధన విధానాలను, బోధన సాంకేతిక పరికరాలను పరిశీలించి కళాశాల చేస్తున్న ఆక్టివిటీస్ ను పరిశీలించిన తర్వత ఆ రిపోర్టు ఆధారంగా బి ప్లస్ గ్రేడ్ ను షాద్ నగర్ కళాశాలకు కేటాయించడం జరిగింది. కళాశాలకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చడానికి ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో కృషి చేశారు. ప్రభుత్వ కళాశాలలను, విద్యను బలోపేతం చేయాలనుకునే నేపథ్యం కలిగిన వ్యక్తి ఈ క్రమంలోనే కళాశాలలో న్యాక్ వెళ్తున్న సందర్భంగా కొన్ని ముఖ్యమైన సౌకర్యాలు మాకు కల్పించాలని ప్రిన్సిపల్ అధ్యాపకులు, కోరిన వెంబడే డోనర్లను మాట్లాడి కళాశాలలో అవసరం ఉన్నటు వంటి కంప్యూటర్లను, బోధనకు అవసరమైనటువంటి ప్రొజెక్టర్లను అన్ని ల్యాబులకు అవసరమైనటువంటి టేబుల్లను, స్టూళ్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పాత కళాశాల బిల్డింగుకు కలర్స్ ను కూడా డోనర్స్ ద్వారా ఏర్పాటు చేసి కళాశాల రూపురేఖలు మార్చారు. ఈ నేపథ్యంలోనే నాక్ గుర్తింపు వల్ల భవిష్యత్ లో ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతాయి. వాటివల్ల కళాశాల ఇంకా అభివృద్ధి చెంది నాణ్యమైన విద్య అందుతుంది..




# పాలమూరు న్యాయ యాత్ర లో పాల్గొన్న పామేన భీమ్ భారత్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8 :**

మహబూబ్ నగర్ పార్లమెంటు పరిధిలోని దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం లో ఏఐసిసి సెక్రెటరీ, ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి , దేవరగద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ,నిర్వహిస్తున్న పాలమూరు న్యాయ యాత్ర లో పాల్గొన్న చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామేన భీమ్ భారత్ , నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణ రెడ్డి , చేవెళ్ల నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుడుపల్లి పెంటా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఈ ఐదు పండ్ల రసాలు షుగర్ ఉన్నవారికి పంచదార కంటే డేంజర్...!

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8:**

డయాబెటిస్‌ను నియంత్రించడానికి చక్కెరను పూర్తిగా తగ్గించాలి. పండ్లలో సహజ చక్కెర కూడా ఉంటుంది, ఇది మధుమేహం రావడానికి చాలా కారణం అవుతుంది. కొన్ని పండ్లలో ఇవి చాలా ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి తక్కువ సమయంలో బ్లడ్ షుగర్ ను రాకెట్ వేగంలో పెంచగలవు. నిజానికి డయాబెటిక్ డైట్‌లో సమతుల పరిమాణంలో పండ్లు తినడం ఆరోగ్యకం. కానీ పండ్ల రసంలో ఫైబర్, ఇతర విటమిన్ల పరిమాణం తగ్గిపోతుంది ఎక్కువగా చక్కెర మిగిలి ఉంటుంది. అందువల్ల వీటిని తాగడం వల్ల బ్లడ్ షుగర్ పెరుగుతుంది. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ పండ్ల రసాన్ని అస్సలు తాగకూడదు. అవేంటో తెలుసుకుంటే..

## ఆపిల్ పండు రసం

యాపిల్ ఒక సూపర్ హెల్తీ ఫ్రూట్ అయితే దాని రసం చక్కెరలో కూడా అంతే ప్రమాదకరం. ఈ పండులో సహజ చక్కెర స్థాయి చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది మధుమేహాన్ని మరింత తీవ్రతరం చేసే పిండి పదార్థాలను కూడా అందిస్తుంది. అందుకే యాపిల్ రసాన్ని తీసుకోవడం ప్రమాదం.

## మామిడికాయ రసం

మామిడి పండ్లలో రారాజు అయితే రక్తంలో చక్కెర శాతం పెంచడంలో మామిడిపండ్ల రసం శత్రువులా పనిచేస్తుంది. దీన్ని తాగిన తర్వాత మధుమేహ రోగులు అధిక దాహం, నోరు పొడిబారడం, రక్తంలో చక్కెర స్థాయి పెరగడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు.

## నారింజ రసం


నారింజ అధిక విటమిన్ సి కలిగిన పండు. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. దీన్ని తింటే అనారోగ్య సమస్యల నుండి సులువుగా బయటపడతారు. కానీ డయాబెటిక్ పేషెంట్లు ఆరెంజ్ జ్యూస్ తాగడం వల్ల చాలా సమస్యలు ఎదురవుతాయి.

## పైనాపిల్ రసం

ఒక కప్పు పైనాపిల్ ముక్కలను తీసుకుంటే అందులోని పిండి పదార్థాలు దాదాపు 16 గ్రాములుగా ఉంటాయి. ఇవి రక్తంలో వేగంగా కరిగి గ్లూకోజ్ స్థాయిని పెంచుతాయి. ఇది హైపర్గ్లేసీమియాకు దారి తీస్తుంది, రోగిని వెంటనే ఆసుపత్రికి తరలించాల్సి వస్తుంది.

## పుచ్చకాయ రసం

పుచ్చకాయ తినడం వల్ల శరీరం హైడ్రేట్ గా ఉండి ఎనర్జీని మెయింటెయిన్ చేస్తుంది. కానీ మధుమేహం, ప్రీ-డయాబెటిస్‌లో దీనిని తీసుకోవడం రిస్క్ తో కూడుకున్నది భవిష్యత్తులో కిడ్నీ దెబ్బతినవచ్చు.



# జాతీయ జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలి : ఉప్పరి శేఖర్ సగర

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8 :**

సి డిమాండ్ల సాధనకై దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పాల్గొని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర. జనాభా దామాషా ప్రకారం చట్ట సభల్లో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖని ఏర్పాటు చేయాలని, జాతీయ జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎంపి బిబి పాటిల్, మాజీ రాజ్యసభ సభ్యులు హన్మంత్ రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షులు రామకృష్ణ, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కులకచర్ల శ్రీనివాస్, బిసి కుల సంఘాల రాష్ట్ర జేఏసి అధ్యక్షులు కుందారపు గణేషా చారి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణిమంజరి సగర, జాతీయ విద్యార్థి సంఘం అధ్యక్షులు విక్రం గౌడ్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు శ్యాం కుర్మ, రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు భాగ్యలక్ష్మి సగర, ప్రొఫెసర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఓపెన్ పరీక్ష ఫీజు ఈనెల 21 వరకు చెల్లించాలి.. కో ఆర్డినేటర్.....

**నిజాంసాగర్, ( జుక్కల్ ) ఫిబ్రవరి 8,మరో ఉదయం,**

ఓపెన్ పది, ఇంటర్ లలో ప్రవేశం పొందిన విద్యార్థులు పరీక్ష ఫీజును ఈనెల 12,నుండి 21 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చు అని జెడ్పిహెచ్ఎస్ పెద్ద కొడప్ గల్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ సి,జి,కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ఈ విద్యా సంవత్సరం లో ఓపెన్ పది, ఇంటర్ లలో ప్రవేశం పొందిన విద్యార్థులు మాత్రమే కాకుండా ఫెయిల్ అయిన వారు కూడా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని , అపరాధ రుసుం తో వచ్చేనెల 3 వరకు చెల్లించాలి అని తెల్పారు. మిగితా వివరాలకు పాఠశాల పని వేళల్లో లేదా సెల్ 9866343898 కు సంప్రదించాలని కోరారు....



# వనదేవతలకు వందనం..

## ఆదిపరాశక్తి సమ్మక్క అసలు చరిత్ర ఇదే..









**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8**

సమ్మక్క పుట్టినూరు బయ్యక్కపేట. సమ్మక్క-సారలమ్మ జాతర మొదట్లో అక్కడే జరిగేది. అయితే భక్తులు ఎక్కువగా రావడంతో బయ్యక్కపేటలో జాతర నిర్వహించడం సమ్మక్క వంశస్థులూ చందా వారికి వసతులు కల్పించడం ఆర్థికంగా కష్టమైంది.

బయ్యక్కపేటలో జన్మించిన దేవత
ఇక్కడే గుడి, అమ్మ ఆయుధాలు
దేవరగుట్టపై జలకంబావి

సమ్మక్క పుట్టినూరు బయ్యక్కపేట. సమ్మక్క-సారలమ్మ జాతర మొదట్లో అక్కడే జరిగేది. అయితే భక్తులు ఎక్కువగా రావడంతో బయ్యక్కపేటలో జాతర నిర్వహించడం సమ్మక్క వంశస్థులూ చందా వారికి వసతులు కల్పించడం ఆర్థికంగా కష్టమైంది. దీంతో పాటు మరికొన్ని కారణాల వల్ల 1940 నాటికి జాతరను మేడారంలో జరపడం ప్రారంభమైంది. మేడారానికి 15 కిలోమీటర్ల దూరంలో ప్రస్తుతం తాడ్వాయి మండలంలో బయ్యక్కపేట ఉంది. సమ్మక్కకు ఇక్కడ గుడి ఉంది. సమ్మక్క గద్దెలూ ఇక్కడ దర్శనమిస్తాయి. గుడిలో సమ్మక్క వాడిన ఆయుధాలు సమ్మక్క చరిత్రకు సాక్ష్యాలుగా. ఉన్నాయి. జాతర తరలింపునకు సంబంధించి సిద్ధబోయిన వంశస్థులతో చేసుకున్న ఒప్పంద కాగితాలు ఇక్కడ అందుబాటులో ఉన్నట్లు చందా పరమయ్య తెలిపారు. జాతరకు సంబంధించిన ఆదాయ, వ్యయాల వాటాలను దీనిలో రాసుకున్నట్లు చందా వంశస్థులు చెబుతున్నారు.

### సమ్మక్క దొరికింది ఇలా..

12వ శతాబ్దంలో పొలాస(ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో మేడరాజు పాలించేవాడు. మేడరాజుకు చిన్నబోయిరాలు, కనకంబోయిరాలు అని ఇద్దరు భార్యలు. ఓ కార్తీకపౌర్ణమి రోజు పెద్ద భార్య చిన్నబోయిరాలు దుంపల కోసం కొంతమంది మహిళలతో కలసి అడవికి వెళ్లింది. అక్కడ తవ్వుతుండగా.. పెట్టె ఒకటి బయటపడింది. దాన్ని తెరిచి చూస్తే అందులో ఓ ఆడబిడ్డ కన్పించింది. పిల్లలు లేని మేడరాజు దంపతులు దైవ ప్రసాదంగా భావించి ఆ పాపను పెంచుకునేందుకు తీసుకెళ్లారు. బిడ్డకు సమ్మక్క అని పేరు పెట్టారు. కొద్దిరోజుల తర్వాత మేడరాజు పెద్ద భార్యకు మన్యుడు, గంద్రగొడ్డలి అనే ఇద్దరు కొడుకులు పుట్టగా, చిన్నభార్యకు నాగులమ్మతో పాటు మరో ఇద్దరు పిల్లలు జన్మించారు. సమ్మక్క మేడరాజు ఇంట్లోనే పెరుగుతూ.. గూడెంలో ఎవరికీ ఏ వ్యాధి వచ్చినా పసరు వైద్యంతోనే నయం చేసేది. ఆమె మాట తీరు, ప్రవర్తన పట్ల గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. మానవ మాత్రులు తినే ఆహారం సరిపోక పోవ డంతో.. రాత్రిళ్లు అందరూ నిద్రపోయిన తర్వాత.. పక్కనే ఉన్న దేవరగుట్టకు పోయి ఆదిశక్తి అవతారం ఎత్తి తనకు నచ్చిన ఆహారాన్ని తిని.. బాలికగా మారి తిరిగి ఇంటికి వచ్చేది. బాలిక ప్రవర్తనలో మార్పును గమనించిన మేడరాజు, కుటుంబ సభ్యులు ఓరోజు రాత్రి బాలికను అనుసరించి దేవరగుట్టకు వెళ్లారు.

బిడ్డ ఆదిశక్తి రూపం దర్శించారు. అప్పటి నుంచి బాలిక ఆదిశక్తిగా భావించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేకంగా చూడడం మొదలుపెడతారు. ఇది నచ్చని సమ్మక్క తనను దేవరగుట్టపై వదిలిరావాలని కోరుతుంది. దీనికి మేడరాజు, గ్రామస్తులు ఒప్పుకోరు. కానీ సమ్మక్క గట్టిగా పట్టుపట్టడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దేవరగుట్టపై వదిలిపెట్టారట. అక్కడ నీటి వసతి కల్పించాలని కోరడంతో మేడరాజు గుట్టకు దగ్గరలో బావిని తవ్వించాడు. ఆ బావిలోనే అమ్మవారు జలకాలాడేదట. అందుకే ఆ బావికి జలకంబావి అని పేరు వచ్చిందని బయ్యక్కపేట గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం అది గక్కవనం అనే దట్టమైన అడవి ప్రాంతంలో ఉంది.

### సమ్మక్కను శాంతింపజేసేందుకు జలకంబావి నీరు..

గిరిజనులు ఈ బావిని నీటిని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారు కాళ్లకు చెప్పులతో బావిదగ్గరకు పోరు. సమ్మక్క ఉగ్రరూపం దాలిస్తే.. ఆమెను శాంతింపజేసేందుకు ఆనక్కాయ(సొరకాయ) బుర్రలో జలకం బావి నీటిని తీసుకెళ్లి ఆమెపై చల్లుతారు. దీంతో సమ్మక్క శాంతిస్తుందంటూ ఇక్కడి గిరిజనులు చెబుతారు. ఆనవాయితీని నేటికి కొనసాగిస్తున్నామని చందా వంశస్తులు తెలిపారు. మాములు రోజుల్లో ఇక్కడికి వచ్చే సాహసం ఎవరూ చేయరు. జాతర సమయంలో మాత్రమే పుజారులు కాళ్లకు చెప్పులు వేసుకోకుండా వచ్చి ఆనక్కాయ బుర్రలో నీటిని తీసుకెళతారు. ఉగ్రరూపంలో ఉన్న అమ్మవారిని తీసుకెళ్లే సమయంలో జలకం బావి నీటిని ఆమెపై చల్లుతారు. ప్రస్తుతం ఈ బావి ఎలాంటి ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది.

### సమ్మక్క పెండ్లి జరిగింది ఇలా..

దేవరగుట్టపై సమ్మక్కను వదిలి వచ్చిన నాటి నుంచి ఆమె అక్కడే పెరిగి పెద్దవుతుంది. క్రూర జంతువులతో ఆడుకునేదని, జలకం బావిలోనే స్నానం చేసేదని ఇక్కడి గిరిజన భక్తులు నమ్ముతున్నారు. మరోవైపు బయ్యక్కపేటలో నాగులమ్మ సైతం పెరిగి పెద్దయ్యింది. కూతుళ్లకు వివాహం చేయాలని మేడరాజు తలిచాడు. సమ్మక్కకు తన చెల్లెలి కుమారుడు మేడారం పాలకుడు అయిన పగిడిద్దరాజుతో వివాహం జరిపించాలని నిర్ణయించాడు. వారి వివాహంలో నాగులమ్మ గొడవ చేస్తుంది. ఆ గొడవలో నాగులమ్మ చేతికి ఉన్న కడియం తగిలి పడిగిద్దరాజు చేతి నుంచి రక్తం కారినట్టు చందా వంశీయులు చెబుతున్నారు. చివరకు పడిగిద్దరాజు సమ్మక్క, నాగులమ్మలిద్దరినీ వివాహం చేసుకుంటాడు. సమ్మక్కకు నాగులమ్మతో సవతి పోరు ఎక్కువవడంతో సొంతూరు బయ్యక్కపేటకు సారలమ్మతో కలిసి చేరుకుంటుంది. ఈ క్రమంలో కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు సామ్రాజ్య విస్తరణ కాంక్షతో పొలాసపై దండెత్తుతాడు. దీంతో 'మేడరాజు పారిపోయి వచ్చి మేడారంలో మేనల్లుడి వద్ద తల దాచుకుంటాడు. కాకతీయ సామంత రాజులైన కోయరాజు, పగిడిద్దరాజులు కరువు కాటకాల వల్ల కాకతీయులకు కప్పం చెల్లించలేకపోయారు. మరోవైపు మేడరాజుకు ఆశ్రయం కల్పించడంతో ప్రతాపరుద్రుడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాఘశుద్ధ పౌర్ణమి రోజు మేడారం పై దండెత్తుతాడు. ఈ యుద్ధంలో మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, గోవిందరాజులు మరణిస్తారు. కుమారుడు జంపన్న సంపెంగ వాగు వద్ద వీరోచితంగా పోరాడి నేలకొరుగుతాడు. అప్పటి నుంచి అది జంపన్న వాగుగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే యుద్ధంలో వీరోచితంగా పోరాడిన సమ్మక్క.. శత్రువుల చేతిలో గాయపడడంతో చిలకలగుట్ట వైపు వెళుతూ మార్గమధ్యలో అదృశ్యమవుతుంది. ఆమెను అనుసరించి వెళ్లిన వారికి ఆమె ఆచూకీ లభించలేదు. ఆ ప్రాంతంలో పుట్ట వద్ద పసుపు, కుంకుమ భరిణె లభిస్తుంది. ఆ భరిణెను సమ్మక్కగా భావించి. పూజిస్తున్నారు.

### సమ్మక్క.. మా దేవత.. ఆ చరిత్ర కల్పితం కాదు.. వాస్తవం సమ్మక్క చావలే..

### తిరుగువారం..

మేడారంలో జాతర ముగిసిన 16 రోజుల తర్వాత బయ్యక్కపేటలో చందా వంశస్తులు ఇక్కడ తిరుగువారాన్ని వైభవంగా నిర్వహిస్తారు. దీనికి ఒక రోజు ముందు ఇంటికొకరు చొప్పున తలస్నానం చేసి అడవికి వెళ్లి.. రెల్లు గడ్డి తెచ్చి ఆలయం పైకప్పుపై కప్పుతారు. చుట్టుపక్కల అరుగులు వేసి ఆలయాన్ని అలంకరిస్తారు. సిద్ధబోయిన వంశస్తులు కొమ్ము, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా గుడికి తీసుకొస్తారు. ఈ సమయంలో దేవరగుట్టలో నాగులకాడి రూపంలో మెరుపు మెరుస్తుందని గిరిజనులు చెబుతున్నారు.

### జాతర ఆదాయవ్యయాలపై ఒప్పందం..

బయ్యక్కపేట నుంచి మేడారానికి జాతర తరలింపునకు సంబంధించి అప్పటి ములుగు తాహశీల్దార్ ఆధ్వర్యంలో 61-1944, వ్యయాలపై ఒప్పంద పత్రం రాసుకున్నారు. అది ఇప్పటికీ ఉంది. జాతర మీద వచ్చిన ఆదాయాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం సమ్మక్క వంశీయుడు చందా పరమయ్యకు, రెండో భాగం నిజాం సర్కార్కు, మూడో భాగం జాతర ఖర్చులకు చెందేలా నిర్ణయించి ఇందులో పొందుపరిచారు.

# కేంద్ర మంత్రి మోరేశ్వర్ పాటిల్ ని కలిసిన ఉప్పరి శేఖర్ సగర

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8 :**

కేంద్ర మంత్రి మోరేశ్వర్ పాటిల్ ని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర. శాలువా తో సత్కరించి అభినందలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సగర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం సగర సాల్ట్ మేకర్స్ ఫెడరేషన్ నేషనల్ కన్వీనర్ కృష్ణ కుమార్ భారతి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణిమంజరి సగర, మహిళా సంఘం నాయకురాలు భాగ్యలక్ష్మి సగర తదితరులు పాల్గొన్నారు.



# సినిమా వార్తలు

## మార్పు తీసుకొచ్చే నాయకుడికి మద్దతు

### విజయ్ పొలిటికల్ ఎంట్రీపై ఉపాసన

తన పనులు, కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉండే మెగా కోడలు ఉపాసన సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటారు. తన యాక్టివిటీస్‌ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాలతోపాటు రాజకీయం గురించి కూడా మాట్లాడారు. తాను మాత్రం రాజకీయాల్లోకి రానని స్పష్టం చేశారు. మార్పు తీసుకువచ్చే నాయకుడికి మద్దతు ఇస్తానని పేర్కొన్నారు. తమిళనాడులో విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై ఆమె స్పందించారు. 'సినీ పరిశ్రమకు చెందిన చాలా మంది రాజకీయాల్లో రాణించారు. ముఖ్యమంత్రులుగా సేవలందించారు. విజయ్ నటుడిగా ఎంతో మంది హృదయాలను గెలుచుకున్నారు. ఆయనకు ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువ. ఇప్పుడు ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారంటే అది గొప్ప విషయం. సమాజంలో మార్పు రావాలని కోరుకునే లీడర్ ఎవరైనా సపోర్ట్ చేయాలనేది నా అభిప్రాయం. ఒకవేళ అలాంటి వాళ్లకు సపోర్ట్ చేయకపోయినా.. వెనక్కి మాత్రం లాగకూడదు. విజయ్ గొప్ప రాజకీయనాయకుడు అవుతారని భావిస్తున్నానని అన్నారు. అయితే ఇప్పటి దాకా ఉపాసన తన చిన్న మావయ్య పవన్ కల్యాణ్, జనసేన పార్టీ గురించి ఎక్కడా మాట్లాడలేదు. కానీ ఇప్పుడు విజయ్ రాజకీయరంగ ప్రవేశం గురించి మాట్లాడటం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఆమె మాటల్ని దాన్ని బట్టి చూస్తే పవన్ కళ్యాణ్ కు కూడా సపోర్ట్‌గా నిలిచే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. సినిమాల గురించి చెబుతూ 'నేను తెలుగు, తమిళ సినిమాలను సబ్ టైటిల్స్‌తో చూస్తాను. ఈ మధ్య అలా చాలా చిత్రాలను చూసి ఎంజాయ్ చేశా. ఈ ఏడాది రానున్న 'గేమ్ ఛేంజర్', 'ఇండియన్ 2' కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. 'గేమ్ ఛేంజర్' షూటింగ్ సమయంలోనే మాకు పాప పుట్టింది. అందుకే ఆ చిత్రం మాకు ప్రత్యేకం. చరణ్ నటించిన 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఆస్కార్ వచ్చిన తర్వాత గేమ్ ఛేంజర్ షూటింగ్‌కి వెళితే.. అక్కడ అందరూ నాటునాటు స్టెప్ వేసి అలరించారు. అది చూసి చాలా ఆనందమేసిందని తెలిపారు. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. కియారా కథానాయిక.





## అనసూయ సినిమా అరి కి డిమాండ్

సినిమాలో కంటెంట్ ఉంటే చాలు.. అది తక్కువ బడ్జెట్ చిత్రమైనా కూడా దానిని రీమేక్ చేయడానికి ఇతర భాషల స్టార్లు ముందుకు వస్తారు. ప్రస్తుతం అనసూయ లీడ్ రోల్‌లో నటిస్తున్న మూవీకి కూడా అదే పరిస్థితి ఏర్పడింది. యాంకర్ నుండి యాక్టర్‌గా మారిన అనసూయ చేతిలో పలు సినిమాలు ఉండగా.. అందులో 'అరి' కూడా ఒకటి. ఈ సినిమా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాకముందే కోలీవుడ్, బాలీవుడ్ నుండి దీని రీమేక్ కోసం పోటీ మొదలయ్యిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే దీని రీమేక్ రైట్స్ కోసం ఒక బాలీవుడ్ స్టార్ లైన్‌లో ఉండగా.. తాజాగా ఒక కోలీవుడ్ హీరో కూడా ఇందులో యాడ్ అయ్యాడని సమాచారం. ద్రుచులు, అరిషడ్వర్గాలు అనే కొత్త రకం కాన్సెప్ట్‌తో 'అరి' తెరకెక్కింది. ఈ సినిమాలో వినోద్ వర్మ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. మనుషుల్లో ఉండే లోతైన కోరికలను తీర్చే పాత్రలో వినోద్ వర్మ కనిపించనున్నాడు. ఇక కోరికలు తీరాలి అనుకునేవారు ఒక్కొక్కరుగా వచ్చి తనకు చెప్పుకుంటారు. అదే సమయంలో వారందరి చేత నేరాలకు పాల్పడేలా చేస్తాడు వినోద్ వర్మ. ఆ తర్వాత వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు వస్తాయి, ఎలా మలుపులు తిరుగుతాయి అనేది మిగిలిన కథ. అలా కోరిక తీరడం కోసం తన వద్దకు వచ్చే ఒక పాత్రలో అనసూయ భరద్వాజ్ కనిపించనుంది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్ విడుదల అవ్వగా.. మూవీ రిలీజ్‌కు మాత్రం సమయం పడుతుంది. ఇంతలోనే 'అరి' రీమేక్ గురించి టాలీవుడ్‌లో చర్చలు మొదలయ్యాయి.

## అడ్వెంచర్ మూవీ ఊరు పేరు భైరవకోన

యంగ్ ట్యాలెంటెడ్ సందీప్ కిషన్ మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోనస విఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్ , వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా లావిష్ స్కేల్ లో నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సగర్వంగా సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులలో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ చిత్రం ఫిబ్రవరి16న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ వర్ష బొల్లమ్మ'ఊరు పేరు భైరవకోన' విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు. చిత్రకత చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. అసలు ఇలాంటి కథ ఎలా అలోచించగలిగారో అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. చేయగలనా? లేదా? అని ఆలోచించుకోవడానికి కొంత సమయం అడిగాను. తర్వాత ఆనంద్ కంప్లీట్ నేరేషన్ ఇచ్చారు. అది విగానే చాలా ఆనందంగా అనిపించింది. చేయగలననే నమ్మకం కుదిరింది.

ఇందులో భూమి అనే పాత్రలో కనిపిస్తాను. భూమి ట్రైబల్ గర్ల్. తన ఊర్లో తనొక్కరే చదువుకున్న అమ్మాయి. చూడటానికి అందంగా అమాయకంగా కనిపిస్తుంది. తప్పుని నిలదీసే ధైర్యం వున్న అమ్మాయి. ఆ పాత్ర బలం సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు అర్ధమౌతుంది. స్వాతిముత్యం, మిడిల్ క్లాస్ మేలోడీస్ చిత్రాల్లో గర్ల్ నెక్ట్స్ డోర్ పాత్రల్లో కనిపించాను. ఇందులో మాత్రం గర్ల్ నెక్ట్స్ ఫారెస్ట్ పాత్ర అనాలి ట్రైలర్ లో చూస్తే నాకు ఒక యాక్షన్ సీన్ ఉంటుంది. భూమి పాత్రలో చాలా పవర్ వుంది. నేను హిల్ స్టేషన్(కూర్గ్) నుంచి వచ్చాను. పక్రుతి జీవితంలో ఒక భాగం. నిజ జీవితంలో కూడా మేము చెట్లు, నదులు, కొండలు, జంతువులని ఆరాధిస్తాం. ఆ రకంగా భూమి పాత్ర నేను రిలేట్ చేసుకునే విధంగా వుందని వివరించారు.




## ఖచ్చితత్వం పాటిస్తున్న నిర్మాతలు

### ఖర్చులు తడిసిమోపెడయితే సినిమాలకు ఫుల్‌స్టాప్

### అక్కడ ఉన్నది స్టార్ హీరో అయినా.. మీడియం రేంజ్ హీరో అయినా.. ఎవరైనా కూడా తమకు వర్కౌట్

కాదు అంటే నిర్మొహమాటంగా సినిమాలను ఆపేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి ట్రెండ్ తెలుగు ఇండస్ట్రీలో ఎక్కువగా కనిపిస్తోంది. సాయి ధరమ్ తేజ్, సంపత్ నంది కాంబినేషన్‌లో రావాల్సిన గాంజా శంకర్ సినిమాను ఆదిలోనే ఆపేశారు సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్. దీనికి కారణం ఆ సినిమా బ్జడెట్ ఇష్యూస్ అని తెలుస్తోంది. సాయి ధరమ్ తేజ్ ఈ సినిమా కోసం దాదాపు 15 కోట్ల రెమ్యూనరేషన్ అడిగినట్టు తెలుస్తుంది. అలాగే ఫైనల్ బ్జడెట్ పేపర్ మీదే 60 కోట్ల వరకు పెరగడంతో.. నిర్మాతలు ముందుగానే జాగ్రత్త పడి ఆపేసినట్టు తెలుస్తోంది. లాంటి విషయమే గోపీచంద్ మలినేని, రవితేజ సినిమాకు కూడా జరిగింది. 3 హిట్స్ ఇచ్చిన కాంబినేషన్ అయినా కూడా బ్జడెట్ వర్కవుట్ కాకపోవడంతో.. ఈ సినిమాను పూజా కార్యక్రమాలతోనే ఆపేశారు మైత్రి మూవీ మేకర్స్. ఇదే సినిమాను అజిత్ హీరోగా ఎ÷-లాన్ చేస్తున్నాడు గోపీచంద్. ఇక నాని, తమిళ దర్శకుడు శిబి చక్రవర్తి కాంబినేషన్ లో రావాల్సిన సినిమాను కూడా నిర్మాత శ్రీనివాసా చిట్టూరి బ్జడెట్ కారణంగానే ఆపేశాడు. ఈ సినిమాకు 100 కోట్లు అవుతుందని దర్శకుడు చెప్పడంతో.. నాని మీద అది వర్కౌట్ అవ్వదని వెనక్కి తగ్గాడు నిర్మాత. కేవలం ఇవి మాత్రమే కాదు.. ఇంకా చాలా సినిమాలు బయటికి రాకుండా ఆగిపోవడానికి కారణం బడ్జెట్ మాత్రమే. విజువల్ వండర్స్ అయితే ఎన్ని వందల కోట్లు పెట్టడానికైనా నిర్మాతలు రెడీగా ఉంటారు. కానీ రొటీన్ కమర్షియల్ సినిమాల కోసం కూడా 60 నుంచి 100 కోట్లు పెట్టాలి అంటే రిస్క్ తో కూడుకున్న వ్యవహారమే. అందుకే నిర్మొహమాటంగా ఆ సినిమాలను ఆపేస్తున్నారు. ఇది కూడా ఒకందుకు మంచిదే అంటున్నారు విశ్లేషకులు. దీని వల్ల దర్శకులు ఒకటికి పది సార్లు ఆలోచించుకుని బ్జడెట్ లెక్కలు చెప్తారు.



Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com